# సైబర్ నేరాల పట్ల గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండండి

**: మహిళలపై జరిగే నేరాలు బాల్య వివాహాలు అరికట్టండి**
**: ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి**
**: మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శక్తి యాప్**
**: వడ్ల రామాపురం గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం**
**: ఆత్మకూరు డిఎస్పి ఆర్ రామాంజి నాయక్**

**ఆత్మకూరు మార్చి 13 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కల్పించుకోవడంలో ముందుండాలని ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజనల్ అధికారి ఆర్. రామంజి నాయక్ తెలిపారు గురువారం మండల పరిధిలోని వడ్ల రామాపురం గ్రామంలో సైబర్ నేరాలపై గ్రామ సదస్సును ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో డీఎస్పీ రామంజి నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శక్తి యాప్ ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని తెలిపారు మహిళలపై జరిగే నేరాలను అరికట్టే విధంగా గ్రామీణ ప్రాంత ప్రజలు పోలీసులకు సమాచారం అందించే విధంగా



ముందుకు రావాలని పిలుపునిచ్చారు బాల్య వివాహాలు నివారించి పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు ప్రస్తుతం ఆత్మకూరు మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో రైతులకు సిద్దాపురం చెరువు నుంచి సాగునీరు పుష్కలంగా ఉండడం మంచి శుభ పరిణామం అని తెలిపారు పొలాల విషయాలలో రైతులు ఒకరికి ఒకరు కలిసిమెలిసి ఉండి ఘర్షణలకు తావు లేకుండా సాగునీటి ద్వారా తమ పంటల్ని సాగు చేసుకోవాలన్నారు అధికంగా సైబర్ నేరాలు అరికట్టాలంటే బ్యాంకు వివరాలు ఓటీపీ నంబర్లు మొబైల్ ద్వారా వచ్చే తప్పుడు యాప్ లకు స్పందించరాదని వివరించారు దొంగతనాలు చైన్ స్నాకింగ్స్ జరుగుతున్న వాటిని ఉండొస్తుగానే గమనించి చీకట్లో వాకింగ్ కు వెళ్లకూడదని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు రైతన్నలు తమ పంటలకు మందులను పిచ్చికారి చేసే సమయంలో నోటికి గుడ్డ కట్టుకొని లేదా మాస్క్ ధరించి పిచ్చికరి చేయాలని తెలిపారు చాలామంది గ్రామాలలో కుటుంబ కలహాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ప్రతి సమస్యకు ఓ పరిష్కారం ఉంటుందని ఎట్టి పరిస్థితుల్లో ఆత్మహత్యలను నివారించే విధంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఆ సమస్యల్ని పోలీసుల దృష్టికి తీసుకురావాలని వివరించారు గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించుకొని తమ పనులను కలిసిమెలిసి చేసుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆత్మకూరు అర్బన్ సీఐ డి.రాము గ్రామీణ ప్రాంత ప్రజలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## అంతరాలను తొలగించే స్నేహాభావం.. హోలీ

**(మొదటి పేజీ తరువాయి ) :** సంవత్సరమంతా సుఖంగా ఉంటారు.. ఇక తెలుగు నెలల్లో చివరిది ఫాల్గుణ మాసం.. హోలీ పర్వదినం ఏటా ఫాల్గుణ పౌర్ణమి రోజున జరుపుకుంటారు.చతుర్ధశి నాడు కాముని దహనం అనంతరం ఫాల్గుణ పౌర్ణమి నాడు వచ్చే హోలీ పండుగను భారతదేశంలోనే కాకుండా నేపాల్, బంగ్లాదేశ్ దేశాల్లో కూడా వైభవంగా జరుపుకుంటారు.. వసంత కాలంలో వచ్చే పండుగ కాబట్టి పూర్వం ఈ పండుగను వసంతోత్సవం పేరిట జరుపుకునేవారు.. దీపావళి తరువాత దేశంలో అత్యంత వేడుకగా జరుపుకునే పండుగల్లో ఇదీ ఒకటి. ఈ పండుగ సత్య యుగం నుంచి జరుపుకుంటున్నట్లు హిందూ పురాణాలు తెలుపుతున్నాయి.. హోలీ అంటే అగ్ని లేదా అగ్నితో పునీమైనది అని అర్థం..

**సహజ రంగులతోనే ఆనందం:** సాధారణంగా హోలీ ఆడిన తర్వాత చాలా మందికి ఇబ్బంది పెట్టేది చర్మ సమస్యలు.. ఇందుకు కారణం రంగుల్లో ఎక్కువ మోతాదులో రసాయన పదార్థాలు కలిసి ఉండడమే.. ఈ తరహా రంగులు శరీరంపై ఎక్కువసేపు ఉంటే చర్మ సంబంధ సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు.. ఇక ఈ తరహా రంగులు పొరపాటున కళ్లలో పడితే చాలా ప్రమాదం కూడా.. అందుకే హోలీ ఆడే సమయంలో ఎంచుకునే రంగుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.. వీలైనంత వరకు రసాయనాలు కలిసిన రంగులకు దూరంగా ఉండాలంటున్నారు.. వీటికి బదులుగా సహజసిద్ధంగా తయారైన రంగులను హోలీ కోసం ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.. కరోనా వైరస్ నేపథ్యంలో చాలా మంది హోలీ వేడుకలకు దూరంగా ఉండాలని భావించినప్పటికీ అక్కడక్కడ హోలీ వేడుకలను యువకులు సంబరాలను చేసుకునేందుకు సిద్ధపడుతున్నారు..పసుపు రంగు నీళ్ల చల్లుకోవడం ఉత్తమమైనదిగా శుభ్రప్రదంగా ఉంటుందని తెలుపుతున్నారు..

**రంగులను కలిపే నీటి విషయంలో జాగ్రత్త:** ఏదో దొరికిన నీటితోనే రంగులను కలపడంతో పాటు ఒకసారి చల్లుకున్న రంగునీటిని మళ్లీ సేకరించి తిరిగి అదే నీటిని పైపుల ద్వారా పంపుతుంటారు.. ఇలాంటి నీటితో చర్మవ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటయనేది వైద్యుల హెచ్చరిక.. వేసవిలోకి ప్రవేశించిన నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి.. ఈసమయంలో హోలీ పేరిట నీటిని వృధా చేయరాదని జలవనరుల నిపుణులు కోరుతున్నారు..

## మద్దికెర సత్యమ్మ మృతి



**ఆలూరు రూరల్, మార్చి13, ప్రభాతవార్త:** ఆలూరు మండలం మొలగవెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ స్వర్గీయ మద్దికెర రంగారెడ్డి కోడలు సత్యమ్మ(93) గురువారం అనారోగ్య కారణాలతో వారి నివాసంలో మృతి చెందారు. మృతురాలికి కొడుకు, కూతురు సంతానం. సత్యమ్మ మామ మద్దికెర రంగారెడ్డి మొలగవెల్లి గ్రామానికి స్వాతంత్ర్యానికి ముందు తరువాత మొదటి సర్పంచ్‌గా 1951లో పనిచేశారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థతోపాటు ప్రధాన రహదారులు నిర్మించారని పెద్దలు తెలిపారు. గద్వాల జిల్లా నాగిరెడ్డిపల్లెలో 1932లో జన్మించిన సత్యమ్మ డీకే సమరసింహారెడ్డికి అత్త వరుస అవుతుంది. నాడు బ్రిటిష్ కాలంలో గద్వాల సంస్థాన రాణి లక్ష్మిదేవమ్మతో కలిసి కర్నూలు పాఠశాలలో చదువుకుందని నాటి చివరి వైస్రాయి లార్డ్ లూయిస్ మౌంట్ బటన్ చేత అవార్డు అందుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతికి సర్పంచ్ మోహన్‌రాజు, గ్రామస్థులు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామనాథ్ యాదవ్, రంగస్వామి, వీరప్ప, చంద్ర, చిన్న ఈరన్న, వైస్ ఎంపిపి శ్రీరాములు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## మహిళా చట్టాలపై విద్యారులు అవగాహన కలిగి ఉండాలి

**ఆళ్లగడ్డ, మార్చి 13, ప్రభాతవార్త:** మహిళా చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్ తెలిపారు. గురువారం ఆళ్లగడ్డ వైపిపిఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లైంగిక నేరాలపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్, జిల్లా 5వ అదనపు జడ్జి మురళీ కృష్ణలు పాల్గొని మాట్లాడుతూ పోక్సో చట్టం మహిళలపై నేరాలకు సంబంధించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫోక్సో చట్టం, లైంగిక నేరాలు, పిల్లల సంఘటనలు, లైంగిక వేధింపులను పరిష్కరించడంలో కుటుంబాలు పాఠశాలల పాత్ర ఎంతైనా ఉందన్నారు. . కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శిశు మహిళా భద్రత కోసం హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. అనుకొని సంఘటనలు జరిగినప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ ఎమర్జెన్సీ 100, 112 కాల్ చేయడం ద్వారా రక్షణ పొందవచ్చని వారు తెలిపారు.

## ఇరువురి కుటుంబ సభ్యుల పై కేసు నమోదు

**కొలిమిగుండ్ల, మార్చి13, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల పరిధిలోని చింతలాయిపల్లె గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 144-1లో మూడెకరాల పొలం విషయంలో దూదేకుల ఇమామ్‌బీ కుటుంబ సభ్యులు మరియు అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బత్తుల వరలక్ష్మిదేవి కుటుంబ సభ్యుల మధ్య ఈనెల 9వ తేదిన గొడవ జరిగిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం దూదేకుల ఇమామ్ బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బత్తుల వరలక్ష్మి మరియు వారి కుటుంబ సభ్యుల పై అలాగే బత్తుల వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దూదేకుల ఇమామ్ బీ వారి కుటుంబ సభ్యుల పై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ బాబు తెలిపారు.

## స్పీడు బ్రేకర్లు వేసి ప్రమాదాల నుంచి కాపాడండి



**ఆత్మకూరు, మార్చి13, ప్రభాతవార్త:** ఏకలవ్యనగర్‌లో స్పీడు బ్రేకర్లు వేసి కాలనీ ప్రజలను రోడ్డు ప్రమాదాల నుంచి కాపాడాలని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఎ.రణదీర్, నాయకులు రామ్‌నాయక్, వీరన్నలు డిమాండ్ చేశారు. గురువారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా పలు కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీ ప్రజలు నడిచేందుకు సీసీ రోడ్డు వేసారు కానీ స్పీడ్ బ్రేక్ వేయకపోవడంతో ఈ రోడ్లపై మోటర్ సైకిల్ స్పీడుగా వెళ్తుండడంతో చిన్నారులకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఏకలవ్యనగర్‌లో వెంకటరాముడు ఇంటి దగ్గర, ఎలిమెంటరి స్కూలు దగ్గర స్పీడ్ బ్రేకర్లు వేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకురాలు దాసమ్మ, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్‌మాసంలో మంచినీటి సమస్యలేకుండ యుద్ధప్రాతిపదికన చర్యలు

**- ప్రత్యేక చొరవచూపిన ఎన్ఎండి.ఫిరోజ్**



**నంద్యాల, మార్చి 13,ప్రభాతవార్త ప్రతినిధి :** రంజాన్‌మాసంలో ప్రజలకు మంచినీటికొరతలేకుండ తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎన్ఎండి.ఫిరోజ్ గురువారం యుద్ధ ప్రాతిపదికన పైపులైను పనులు పూర్తి చేయించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. నంద్యాల పట్టణం టిటిడి కళ్యాణమండపం సమీపంలో ఫైజర్ కారణంగా మంచినీటి పైపులైను లీకేజితో ఏర్పడిన సమస్యకు స్పందించి త్వరితగతిన పరిష్కారానికి కృషిచేశారు. ఈ సమస్య వల్ల నంద్యాల పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నీటిసరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదు అందడంతో పవిత్ర రంజాన్‌మాసాన్ని దృష్టిలో ఉంచుకుని ముస్లింసోదరులకు, ఇతర ప్రాంత ప్రజలకు ఇబ్బదిలేకుండ ఫిరోజ్ ప్రత్యేక శ్రద్ద వహించి పైపులైన్ లీకేజి సైట్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి నీటిసరఫరా పునరుద్దరించేలా సకాలంలో పనులు పూర్తిచేయాలని వాటర్‌వర్క్స్ అధికారులను సూచించారు. ఫిరోజ్ చొరవతో ప్రజలకు ఉపశమనం కలిగింది. సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిన ఫిరోజ్‌కు నంద్యాల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మునిసిపల్ వాటర్ వర్క్స్ డిఇ నాగభూషణంరెడ్డి, ఇఓ రవూఫ్, టిడిపి నాయకులు కృపాకర్, ఎన్ఎండి షాకీర్, శేఖర్, మున్సిపల్ ఫిట్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కబ్జా చేశారన్న ఆరోపణలు అవాస్తవం



**ప్యాపిలి మార్చి 13ప్రభాతవార్త :** ప్యాపిలి పట్టణంలో మనోహరమ్మకు చెందిన ఏడు సెంట్ల స్థలాన్ని కబ్జా చేశామని చేసిన ఆరోపణలు అవాస్తవమని ఎర్రగుంట్లపల్లె గ్రామానికి చెందిన బత్తుల రమేష్ రెడ్డి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ కుటుంబానికి ఉన్న 5.25 సెంట్ల భూమి ఉందని, అందులో గోవిందరాజ్ కు తాము 5.10 సెంట్ల భూమిని మాత్రమే విక్రయించినట్లు పేర్కొన్నారు. మిగిలిన భూమి తమదని పేర్కొన్నారు. 2010కి ముందే కాలేజీకి కొనుగోలు చేసి ప్రహరీ గోడ కోసం కబ్జా చేశారని ఆరోపించారు.ఈ విషయాన్ని మనోహరమ్మ అడిగితే కులం పేరుతో దూషించినట్లు, బెదిరింపులకు గురి చేసినట్లు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కుట్ర పూరితంగా, ఉద్దేశ్య పూర్వకంగా డాక్టర్ యల్లప్ప వ్యవహరిస్తున్నారని తెలిపారు....

## నాటు సారా వికరిస్తే కేసులు తప్పవు ఎక్సైంజ్ డిఎస్పి రాముడు..



**పాణ్యం మార్చి 13, ప్రభాతవార్త :** గ్రామాలలో నాటసార విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైంజి డిఎస్పి రాముడు తెలిపారు గురువారం స్థానిక చెంచు కాలనీలో సర్పంచ్ పల్లవి అధ్యక్షతన నవోదయం కార్యక్రమం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ నాటుసారా సేవించడం వల్ల ఎన్నో దుర్ప్రయోజనాలు ఉన్నాయన్నారు గతంలో సారా కేసులో దొరికిన వారి పేర్లు ఇంకా అలాగే ఉన్నాయన్నారు ప్రభుత్వం గిరిజనుల కోసం ఎన్నో సంక్షేమ ఉపాధి కార్యక్రమాలు ఏర్పాటు చేసిందన్నారు ఈ కార్యక్రమంలో ఎక్సైంజ్ సిఐ లక్ష్మారావు కృష్ణమూర్తి ఎస్సై లో బ్రహ్మయ్య అఖిల పాణ్యం ఏ ఎస్ ఐ నరసింహులు వీఆర్వో శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శి మాజీ జెడ్పిటిసి నారాయణమ్మ పాల్గొన్నారు

## విజయ్ నికేతన్ లో ఘనంగా హోలీ సంబరాలు..



**పాణ్యం మార్చి 13, ప్రభాతవార్త :** స్థానిక విజేత పాఠశాలలో ముందస్తు హోలీ సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు పాఠశాల డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి చిన్నపిల్లలతో కలిసి రంగుల వసంతం జరుపుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపశమనం పొందేందుకు వసంత కేళి ఒక మంచి శుభపరి నామం అని అన్నారు పూర్వకాలంలో సహజసిద్ధమైన కుంకుమ పసుపులను చల్లుకొని సంతోషన్ని పంచుకునే వారిని తెలిపారు వేణుగోపాల్ మురారి బ్రహ్మం రాజశేఖర్ జహీర్ తదితరు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## కమనీయం శ్రీ ఉచ్చువీరప్ప తాత రథోత్సవం

**- తరలివచ్చిన భక్తజనం**



**ఆలూరు రూరల్, మార్చి13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దహోతూరు గ్రామంలో వెలసిన శ్రీ ఉచ్చు వీరప్ప తాత, చలువప్ప తాత రథోత్సవం భక్తిశ్రద్ధలతో రమణీయంగా జరిగింది. గురువారం ఉదయం ఉచ్చువీరప్ప తాత దేవాలయం నందు గణపతి పూజ, సరస్వతి దేవత పూజ, సుదర్శన హోమం, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలను అర్చకులు సిద్దయ్య స్వామి, చంద్రమౌలి స్వామి నిర్వహించారు. అలాగే మర్కట్ గ్రామంలో వెలసిన చలువప్ప తాతను పల్లకిలో ఊరేగింపుగా పెద్దహోతూరు ఉచ్చువీరప్ప తాత దేవాలయానికి చేరుకుంటారు. రాత్రి 7గంటలకు వేలాది మంది భక్తుల నడుమ అన్నదమ్ములైన ఉచ్చువీరప్ప తాత, చలువప్ప తాతల రథోత్సవం ఘనంగా నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు ఆంధ్ర, కర్ణాటకలతోపాటు చుట్టుపక్కల ఉండే గ్రామాల భక్తులు పెద్దఎత్తున పెద్దహోతూరుకు తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐ దిలీప్ కుమార్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు జోరాపురం మునెమ్మ, ఎల్లప్ప, సొసైటీ మాజీ చైర్మన్ సౌమ్యరెడ్డి, ఎంపిటిసిలు చిన్న యాదవ్, దేవరాజ్, టీడీపీ యువనాయకుడు జోరాపురం వీరేశ్, విద్యా కమిటీ చైర్మన్ కె.కె.డి.చిన్న రామన్న, కురువ లక్ష్మన్న, ప్రకాష్, హోసురప్ప, కరెంట్ దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మార్చి 18న జాబ్‌మేళా



**ఆత్మకూరు,మార్చి13,ప్రభాతవార్త:** మార్చి 18న నిర్వహించే జాబ్‌మేళను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డిలు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళ పోస్టర్‌ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ జాబ్‌మేళకు 5 ప్రవేట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ జాబ్‌మేళాలో పాల్గొనువారు పదవతరగతి, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజి పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోగలరని కోరారు. వివరాలకు 6303244165, 7673902328 నెంబరులను సంప్రదించాలన్నారు.

## ఎండిఏ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాష్ట్రంలో పెరిగిన మతపరమైన దాడులు



**హోళగుంద మార్చి13,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి మతపరమైన దాడులు పెరగడం చాలా దారుణం అన్నారు ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ ఇది బీజేపీ యొక్క అసలు నిజస్వరూపాన్ని బహిర్గతం చేస్తుందన్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మతపరమైన పార్టీలకు తావులేదు అయినప్పటికీ టిడిపి పార్టీతో భాగస్వామ్యంతో పోటీ చేయడం వలన బిజెపి నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 8 ఎమ్మెల్యే స్థానాలు రావడం జరిగిందని. నాటి నుండి బిజెపి ఆంధ్ర రాష్ట్రంలో తమ పట్టును నిలబెట్టుకోవడానికి ఈ విధమైనటువంటి మతపరమైన దాడులను ప్రేరేపిస్తూ ఆంధ్రప్రదేశ్ ను ఉత్తరాది రాష్ట్రాల వలె ప్రతినిత్యం మతపరమైన కలహాలను సృష్టించి తమ రాజకీయ లబ్ది పొందడానికి ప్రయత్నం చేస్తుందని వారు మండిపడ్డారు. కావున రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బిజెపి తో భాగస్వామ్యాన్ని విడిచి ఎన్ డి ఏ కూటమి నుండి వైదొలగాలని మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముస్లిం మైనారిటీ నమ్మకాన్ని నిలబెట్టాలని తద్వారా రాబోయే ఎన్నికలలో టిడిపికి రాష్ట్రంలో మంచి భవిష్యత్తు ఉండవచ్చు లేనిపక్షంలో రాష్ట్రంలో ఉన్నటువంటి ముస్లిం, మైనారిటీలు మరియు సెక్యులర్ వాదులు మీకు వ్యతిరేకిస్తారని రాబోయే 2029 ఎన్నికలలో మీకు తీరని నష్టం కలిగించే విధంగా మీకు వ్యతిరేకిస్తారని తెలియజేస్తూ గత అసెంబ్లీ సమావేశాలలో ఆదోని నియోజకవర్గం బిజెపి ఎమ్మెల్యే అసెంబ్లీ లో ముస్లింల మనోభావాలను కించపరిచే విధంగా చేసినటువంటి వ్యాఖ్యలను యస్ డి పి ఐ తీవ్రంగా ఖండిస్తోందిన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సమగ్రతను కాపాడాలని శాంతి యుత వాతావరణాన్ని నెలకొల్పాలని సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఎస్ డి పి ఐ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతుంద అని యస్ డి పి ఐ రాష్ట్ర నాయకులు చాంద్ బాషా రాష్ట్ర ఉపాధ్యక్షులు, అబ్దుస్ సుభాన్ రాష్ట్ర కార్యదర్శి, మహమ్మద్ తాహిర్ రాష్ట్ర కార్యదర్శి సమావేశంలో తెలిపారు. సమావేశం లో ఎస్ డి పి ఐ నేతలు జాబీర్ అలీ ఖాన్, అక్బర్ అలీ మరియు కడప జిల్లా జాయింట్ ఆక్షన్ కమిటీ కన్వినర్ సైయద్ అహ్మద్ బాషా బాబు తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలి



**జూపాడుబంగ్లా,మార్చి 13,ప్రభాతవార్త:** మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 32 మంది విద్యార్థులకు తెలుగుయువత మండల అధ్యక్షుడు మందడి దొరబాబురెడ్డి,టిడిపి యువనాయకులు మందికుంట మహేశ్వర్‌రెడ్డి పరీక్షకు అవసరమయ్యే పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్ళు అందజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు పాఠశాలలోని విద్యార్థులు 100శాతం మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలని, ప్రతి ఒక్కరు కష్టంతో కాకుండ ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌శర్మ, లక్ష్మన్న, ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నాగార్జున,ఫీల్డు అసిస్టెంట్ తిరుపతయ్య,ఉపాధ్యాయులు లక్ష్మినారాయణ,విజయలక్ష్మి,కృష్ణకుమారి, జ్ఞానేశ్వరి,శ్రీనువాసులు,శివన్న తదితరులు పాల్గొన్నారు.

## కొలిమిగుండ్లలో వీధిలైట్ల ఏర్పాటు



**కొలిమిగుండ్ల, మార్చి13, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కొలిమిగుండ్లలోని పలు వీధుల్లో వీధిలైట్లులేక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. రాత్రి సయంలో వీధిలైట్లు లేకపోవడంతో ఆయా రహదారుల్లో వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ శివరాముడు ప్రజల సౌకర్యార్థం వీధిలైట్లను రిపేరు చేసి వాటిని వెలిగేలా చేశారు. దీంతో ఆయా కాలనీ వీధిలైట్ల సమస్య పరిష్కారమైనట్లుయింది.

## కోటపాడు గ్రామంలో ఉపాధి హామీ పనుల పై ఆడిట్



**కొలిమిగుండ్ల, మార్చి13, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో గురువారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల పై అధికారులు ఆడిట్ నిర్వహించారు. ఈ మేరకు 2023-2024 సంవత్సరంలో జరిగిన వివిధ పనుల పై క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించిన తరువాత ఆడిట్ నివేదికను గ్రామసభలో సోషల్ ఆడిట్ అధికారులు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎం.వి.శివరామిరెడ్డి, ఎం.శివారెడ్డి, ఎం.సుంకమ్మ, సర్పంచ్ ఎం.కళావతి, ఎంపిటిసి అమరావతి, జి.పి.సెక్రటరీ మరియు ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

## ఆది జగద్గురు శ్రీశ్రీశ్రీ రేణుకాచార్య 1008 జయంతి మహోత్సవం



**కర్నూలు విద్య, మార్చి 13, ప్రభాతవార్త:** కర్నూలు నగరం నందు జంగమహేశ్వర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆది జగద్గురు శ్రీశ్రీశ్రీ రేణుకాచార్య 1008 జయంతి మహోత్సవంను జిల్లా పరిషత్ అవరణలో శ్రీశ్రీశ్రీ ఓంకారేశ్వర స్వామి దేవాలయం నందు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో జంగం సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ మల్లేశ్వరయ్య, ప్రధానకార్యదర్శి చంద్రశేఖరయ్య, సహాధ్యక్షుడు యుం ఎం రుద్రయ్య,ఉపాధ్యక్షుడు విరుపాక్షయ్య, సహ కార్యదర్శి పి శివకుమార్, ఎం సిద్దేశ్వర్, ఎం విశ్వనాథ శాస్త్రి, డా.పశుపతి శర్మ, జిల్లా సభ్యులు గౌరవాధ్యక్షులు మల్లిఖార్జునయ్య, డిఏఓ జిల్లా ఉపాధ్యక్షులు బి మహేష్ మొదలగు వారు పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి పూజ అల్పాహారం ఏర్పాటు చేశారు.

## పెద్ద మల్లారెడ్డి జ్ఞాపకార్థం విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ..



**మిడుతూరు మార్చి 13, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మిడుతూరు జడ్పీ పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తువ్వ పెద్ద మల్లారెడ్డి జ్ఞాపకార్థం క్రీడా దుస్తులు, ఆట వస్తువులు పంపిణీ చేసినట్లు ఆయన కుమారుడు తువ్వ అయ్యప్ప రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులకు టీ షర్టులు, వాలీబాల్, త్రో బాల్, ఇతర ఆటో వస్తువులతోపాటు, పదవ తరగతి చెందిన విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు సాయి తిమ్మయ్య, రోషి, భాష తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానానికి మించిన దానం మరొకటి లేదు



**చాగలమర్రి, మార్చి 13, ప్రభాతవార్త** లోకంలో అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని పారిశ్రామికవేత్త చక్రంబీడి అధినేత చక్రం షబ్బీర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెద్దవంగలి గ్రామంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అలాగే గంధం, ఉరుసునకు రెండు రోజుల పాటు కొనసాగే అన్నప్రసాద వితరణకు సరుకులను షబ్బీర్ అందజేశారు. ఈ మేరకు నిర్వాహకులు దాతను శాలువ, పూలమాలతో సత్కరించారు.

## కిడ్నీ అనేది మన అవయవాలలో ముఖ్యమైన భాగం



**కర్నూలు హాస్పిటల్, మార్చి 13, ప్రభాతవార్త:** కిడ్నీ అనేది మన అవయవాలలో ముఖ్యమైన భాగమని శరీరంలో ఎటువంటి చెడు పదార్థాలైన బహిర్గతం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. గురువారం వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిజిహెచ్ మరియు కెఎంసి నెఫ్రాలజీ విభాగం ఆధ్వర్యంలో సిఎంఈ ప్రోగ్రామ్ నిర్వహించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు తెలిపారు. కిడ్నీ సంబంధిత వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం దీని ముఖ్యఉద్దేశమని కార్బొనేటెడ్ పానియాలు, ప్రాసెస్ చేసిన మాంసం మొదలైనవి మూత్రపిండాల ఆరోగ్యానికి హానికలిగిస్తాయని మంచి ఆరోగ్యానికి ప్రతిఒక్కరు జాగ్రత్తలు పాటించి ఆహారనియమాలు పాటించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. కెఎంసి ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ మాట్లాడుతూ దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి (సికెడి) గురించి అవగాహన పెంచడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఈసమస్యను ఎదుర్కొవడంలో ప్రజలందరి భాగస్వామ్యం పెంచడానికి ఇదో మంచి ముందడుగన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.ఎ శశికిరణ్ ఎండిడిఎం సీనియర్ నెఫ్రాలజిస్ట్ యశోధ హాస్పిటల్ హైదరాబాద్ వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సూపరింటెండెంట్ డా.శ్రీరాములు, డా.సీతారామయ్య, నెఫ్రాలజి విభాగపు వైద్యులు డా.జిక్కి, డా.ఆనంత్, డా.వెంకటలక్ష్మిరెడ్డి, డా.శ్రీధర్ శర్మ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణకు ధరఖాస్తుచేసుకోవాలి

**-ఎంపిడిఓ సుహాసినమ్మ**

**వెల్దుర్తి,మార్చి13,ప్రభాతవార్త :** జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ కర్నూలు వారి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు ఎంపిడిఓ సుహాసినమ్మ తెలిపారు.ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ ఏపి ప్రభుత్వం బిసి,ఈబిసి,కమ్మ,రెడ్డి,క్షత్రియ,వైశ్య,బ్రహ్మణం,కాపు(బలిజ),కులాల మహిళలకు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి,శిక్షణ పూర్తి అయినతర్వాత కుట్టుమిషన్‌లను ఇవ్వబడునని ఆమె తెలిపారు.18 నుంచి 50 సంవత్సరాలలోపు మహిళలు ఈనెల 8 నుంచి 22వ తేదివరకు సచివాలయం,ఎంపిడిఓ కార్యాలయంలో ఆన్‌లైన్ నుందు ధరఖాస్తు చేసుకొనుటకు అవకాశం కల్పించబడిందన్నారు.ధరఖాస్తుచేసుకొనుటకు లబ్దిదారులు ఆధార్‌కార్డు,రేషన్‌కార్డు,కులం సర్టిఫికెట్ తీసుకొని వెళ్లాలన్నారు.టైలరింగ్ శిక్షణ కాలంలో 75 శాతం హాజరును ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వార పరిగణనలోకి తీసుకొని కుట్టమిషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ మహిళలను కోరారు.

## బియ్యంకార్డులో ఈకేవైసిని పూర్తిచేసుకోవాలి

**- తహశీల్దార్ చంద్రశేఖర్‌వర్మ**

**వెల్దుర్తి,మార్చి13,ప్రభాతవార్త :** మండలంలోని రేషన్‌కార్డుదారులు తమ కార్డులో పెండింగ్‌లో ఉన్న కుటుంబసభ్యుల ఈకేవైసిని పూర్తిచేసుకోవాలని మండల తహశీల్దార్ చంద్రశేఖర్‌వర్మ తెలిపారు.ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మీ డీలర్,విఆర్ఓ లాగిన్‌లో ఈకేవైసి పూర్తిచేసుకోవాలని సూచించారు.ఈకేవైసి చేయించుకోని సభ్యులకు వచ్చే నెల ఇన్‌ఆక్టీవ్‌లో ఉండి నిత్యావసరవస్తువులు అలాట్‌మెంట్ రాదన్నారు.ఈ విషయంపై రేషన్‌కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసి చేయించుకోవాలని తహశీల్దార్ కోరారు.

# వాల్మీకుల అభివృద్ధి ఎమ్మెల్యే పార్థసారథితోనే సాధ్యం

**- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసిన వాల్మీకి సంఘం నాయకులు**



**ఆదోనిటౌన్, మార్చి13, ప్రభాతవార్త;** వాల్మీకుల అభివృద్ధి ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథితోనే సాధ్యమని వాల్మీకి సంఘం నాయకుడు వాల్మీకి సాయిప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలో వాల్మీకి సంఘం నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదోని అభివృద్ధి ఎమ్మెల్యేతోనే సాధ్య పడుతుందన్ననరు. అసెంబ్లీలో వాల్మీకులకు న్యాయపరమైన గిరిజన జాబితాలో చేర్చాలన్న ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సరైన ప్రతిపాదనలతో పంపాలని, 60 సంవత్సరాల రాజ్యాంగబద్ధమైన పోరాటానికి ఎన్‌డీయే కూటమి ప్రభుత్వం అండగా ఉండాలని ఎమ్మెల్యే పార్థసారథి విన్నవించడం జరిగింద న్నారు. గతంలో రాయలసీమలో వాల్మీకుల ఓట్లతో ఎమ్మెల్యేలుగా ప్రజాప్రతినిధులుగా అసెంబ్లీలో కూర్చొన్న వారు కనీసం వాల్మీకి బోయల సమస్యలపై అసెంబ్లీలో ఏనాడు మాట్లాడలేకపోయారన్నారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అసెంబ్లీలో వాల్మీకుల సమస్యను సీఎం దృష్టికి, స్పీకర్ దృష్టికి తీసుకెళ్లడం సంతోషించదగ్గ విషయమన్నారు. వాల్మీకులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియ జేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకుఃఉ వాల్మీకి సీనియర్ నాయకకులలు సింహం నాగేంద్ర, బి.గోపాల్, బంకాముని, చంద్ర, తాయన్న, బిల్లాల రామాంజనేయులు, ఉషారాజు, సంజీవ్, నరసింహులు, దేవేంద్ర, లక్ష్మీనారాయణ, రామయ్యచాటి తదితరులు పాల్గొన్నారు.

# పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలి

**- విద్యార్థుల జీవితానికి తొలి మెట్టు పదోతరగతి - సీఐ అశోక్‌కుమార్**



**కౌతాళం, మార్చి13, ప్రభాతవార్త;** విద్యార్థుల జీవితానికి తొలి మెట్టు పదోతరగతి అని, విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని కౌతాళం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని ఎరిగేరి ఉన్నత పాఠశాలను సీఐ సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ పాఠశాలలో స్కౌట్ విద్యార్థులు, పాఠశాల హెచ్‌ఎం ఆహ్వానం మేరకు పాఠశాలను సందర్శించారు. అనంతరం డిజిటల్ మోసాలు, డిజిటల్ మోసాలు జరగకుండా ఎలా అప్రమత్తంగా ఉండాలో విద్యార్థులకు తెలియజేశారు. ప్రతిఒక్కరూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వాటి బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. పదో తరగతి విద్యార్థు ఒత్తిడి లేకుండా ఎలా ఉత్తీర్ణత సాధించాలో తగిన మెళుకువలు తెలియజేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలలో స్కౌట్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమేష్‌నాయుడు, ఉపాధ్యాయులు రామకృష్ణుడు, వెంకటేశ్వర్లు, రాము, శ్రీనివాసులు, భీరప్ప, జ్ఞానేశ్వర్, పోలీసు సిబ్బంది పాల్గొన్ననరు.

# గోనెగండ్ల సీఐగా విజయభాస్కర్



**గోనెగండ్ల,మార్చి, 13, ప్రభాతవార్త :** గోనెగండ్ల మండల సీఐగా విజయభాస్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న గంగాధర్ కర్నూలు వీఆర్‌కు బదిలీ పై వెళ్లారు. నంద్యాల వీఆర్‌లో ఉన్న సీఐ విజయభాస్కర్ బదిలీ పై గోనెగండ్లకు వచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన విజయభాస్కర్ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా శాంతి భ ద్రతలకు విఘూతం కల్పిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ ఇసుక, మద్య ం, గుట్కా, మట్కా లాంటి ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

**చేసి సేవలు చిరకాల గుర్తుంటాయి-ః డీఎస్పీ ఉంపేద్రబాబు**

ప్రజలకు చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయిని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. గోనెగండ్ల సీఐ గంగాధర్ బదిలీ పై వెలుతున్న కారణంగా గురువారం రాత్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని సన్మానసభ ఏర్పాటు చేశారు. పోలీస్ సిబ్బంది, పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు, యువకులు గంగాధర్‌కు పూలమాలలు, శాలువతో ఘనంగా సన్మానించారు. అలాగే నూతనంగా బాధ్యతలు చేపట్టిన విజయభాస్కర్‌కు కూడా ప్రజలు, నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



**పాములపాడు (రూరల్), మార్చి 13, ప్రభాతవార్తః** పాములపాడు మండలం కృష్ణానగర్ గ్రామానికి చెందిన కామేశ్వర్‌రావు (45) విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు కోతమిషన్‌తో ఆర్వేస్టార్ జొన న్నపంట కోసేందుకు వెళ్లి సాయంత్రం చీకటి పడ్డాక ఇంటికి వచ్చే క్రమంలో కరెంట్ తీగలు కోతమిషన్‌కు పైభాగంలో తగలడంతో ప్రమాదవశాత్తు తీగలు మిషన్‌కు తగలడంతో మిషన్‌పై ఉన్న కామేశ్వర్‌రావు కరెంట్‌షాక్ గురై మృతిచెందాడు. ఈఘటనపై పాములపాడు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతిచెందిన కామేశ్వర్‌రావుకు భార్య ఇద్దరు కుమారులున్నారు. కుటుంబంలో రోదనలు మిన్నంటాయి.

# ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ వి బాలయ్య మృతి



**కర్నూలు హాస్పిటల్, మార్చి 13, ప్రభాతవార్తః** ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ వి బాలయ్య అనారోగ్యంతో కన్నుమూశారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల కర్నూలు నందు మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అఫీస్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలు నాయక్ ఆధ్వర్యంలో ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. ముందుగా జెండా ఔనత్యం చేసి ఆయన ఆత్మకు శాంతికలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈసందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అబ్రహం మాట్లాడుతూ బాలయ్య లాంటి పోరాట యోధుని కూలిపోవడం యూనియన్‌కు తీరని లోటన్నారు. ఈకార్య క్రమంలో శాఖ సెక్రెటరీ ఖాజా ముద్దిన్, ట్రెజరర్ సురేష్, యూనియన్ నాయకులు రమేష్, సుందరాజు, శశిరెడ్డి ఉరుకుందయ్య, మల్లిఖార్జున, సుశీలమ్మ, భాగ్యమ్మ, గీతా, కళ్యాణి, విజయలక్ష్మి, రాముడు, నవీన్, హరిచంద్ర నాయుడు, రాజేష్, సంజీవ, రవి, వెంకటేశ్వర్లు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రగుడూరు అండర్‌పాస్ బ్రిడ్జిపై విచారణ చేసిన నేషనల్ హైవే పీడీ



**పాములపాడు (రూరల్), మార్చి 13, ప్రభాతవార్తః** పాములపాడు మండలం ఎర్రగుడూరు గ్రామంలో జాతీయ రహదారి 340-సి ఎర్రగుడూరు అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు సర్పంచ్, ఎంపిటిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. గ్రామంలోని మరికొంత మంది నాయకులు, ప్రజలు అండర్‌పాస్ బ్రిడ్జి వద్దని ఫ్లెక్సీ బ్యానర్ ఏర్పాటు చేసి బుధవారం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈవిషయంపై గురువారం నేషనల్ హైవే పీడీ పద్మ ఎర్రగుడూరు గ్రామంలో ప్రజల అభిప్రాయసేకరణ చేశారు. పీడీతో కొంతమంది బ్రిడ్జి కావాలని, మరికొంత మంది బ్రిడ్జి వద్దని తెలిపారు. ఈవిషయంపై మెజార్టీ ప్రజల అభి ప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటామని పీడీ తెలిపారు. ఈకార్యక్రమంలో పాములపాడు ఎస్ఐ సురేష్‌బాబు, నేషనల్ హైవే కాంట్రాక్టర్ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

# కొలతల ప్రకారం పనిచేయాలి



**పాములపాడు (రూరల్), మార్చి13, ప్రభాతవార్తః** ఉపాధి పనులలో రోజుకు రూ.300 వేతనం తీసుకోవాలంటే కొలతల ప్రకారం పనిచేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ కూలీలకు సూచించారు. గురువారం పాములపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామి పనులను ఎంపీడీఓ పరిశీలించి మస్టర్ వెరిఫికేషన్ చేశారు. మేటీలు ఉపాధి కూలీలకు ఖచ్చితమైన సూచనలు చేసి పనులు చూపాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఓ విమలమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ ఫయాజ్‌లు పాల్గొన్నారు.

# ఘనంగా ఉరుసు మహోత్సవం



**చాగలమర్రి, మార్చి 13, ప్రభాతవార్త**

మండలంలోని పెద్దవంగలి గ్రామంలో హజరత్‌దస్తగిరి స్వామి ఉరుసు మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉరుసు మహోత్సవానికి కర్నూలు జిల్లాతో పాటు కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. దస్తగిరి స్వామి వారికి రబ్బానీ ఇంటి నుంచి గంధం మహోత్సవం మేళాతాళాలతో ఫకీర్లతో ఊరేగింపుగా తీసుకుని వెళ్లారు. ఉరుసు మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండ సిఐ మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిఐ చాంద్‌బాష, ఎస్ఐలు హరిప్రసాద్, రమణయ్య, నరసింహులు, ఎండి.రఫీ, యేసయ్య, నబీరసూల్, పోలీసు సిబ్బంది ప్రత్యేక బలగాలతో గట్టి పోలీసుబందోబస్తు ఏర్పాటుచేశారు. ఉరుసుకు వచ్చిన భక్తులందరికీ దస్తగిరిస్వామి కమిటీ ఆధ్వర్యంలో నాలుగురోజుల పాటు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

# ప్రజాసమస్యలను పరిష్కరించాలి



**చాగలమర్రి మార్చి 13, ప్రభాతవార్త**

చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీలో నెలకొన్న వివిధ ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు, నంద్యాల జిల్లా బిసి సెల్ స్పోక్ పర్సన్ చల్లానాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో గురువారం మేజర్ గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తెహరా హుసేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్లు, మురుగునీరు, కాలువల పరిశుభ్రత, విద్యుత్ దీపాలు, మంచినీటిసమస్య, తదితర అంశాల గురించి వినతిపత్రం ద్వారా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర టిఎన్‌టియుసి కార్యదరి ్శ గుత్తినరసింహులు, నాయకులు కశినేని ఓబులేసు, టైలర్‌బాష, వెంకటయ్య, బషీర్, అబ్దుల్లా, నారాయణ, రమణ, ఖాద్రి, ఫకృద్దీన్, చంద్రబాబు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సేవా కేంద్రాల వద్ద ముసాయిదా జాబితా



**తుగ్గలి, మార్చి 13, ప్రభాతవార్త:** ఈ-పంట నమోదు రబీ 2024-25 ముసాయిదా జాబితాను మండలంలోని అన్ని గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో ఈ నెల 11వ తేదీ నుండి 21 వరకు ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించడం జరుగుతుందని ఏవో పవన్‌కుమార్ తెలిపారు. రైతులకు రెవెన్యూ శాఖ మరియు వ్యవసాయ శాఖ కలిసి ఈ-పంట నమోదు పూర్తి చేయడం జరిగిందన్నారు. గ్రామ సభలలో రైతు సేవా కేంద్రం సిబ్బంది జాబితాలో ఉన్న రైతుల వివరములను చదివి వినిపించడం జరుగుతుందని కావున రైతులు ముసాయిదా జాబితాను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే సవరణ కొరకు మీరైతు భరోసా కేంద్రంలో ఉన్న వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి అభ్యంతరాలను రాత పూర్వకంగా తెలియజేయాలని ఆయన తెలిపారు.

# మలేరియా జోనల్ అధికారి ఆకస్మిక తనిఖీ



**చాగలమర్రి, మార్చి 13 ప్రభాతవార్త**

మండలకే ంద్రమైన చాగలమర్రిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం మలేరియా విభాగ్ జోనల్ అధికారి డా.లక్ష్మణ్‌నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. వైద్యసిబ్బంది ప్రజారోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని తప్పకుండ నిర్వహించాలని ఆదేశించారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈయన వెంట ఎంపిహెచ్ఇఓ నిత్యపుల్లయ్య, హెల్త్‌సూపర్‌వైజరు రామలింగారెడ్డి, స్టాఫ్‌నర్సు ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

# డా.బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని ఏపీలో ఏర్పాటు చేయాలి



**కర్నూలు విద్య, మార్చి 13, ప్రభాతవార్తః**

డా.బి ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని అల్ ఇండియా స్టూ ండెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఎ) వారు పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఒపెన్ అంబెద్కర్ సెంటర్ ముందు ఏఐఎస్ఎ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర భ్ంగా ఏఐఎస్ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయం మన ఏపీ నందు 1982లో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పేరుతో ఏర్పాటు చేశారు. తర్వాత 1992లో డా.బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివరి ్సటిగా పేరు మార్పు చేస్తు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఏపీలో 13 జిల్లాలకు సంబంధించి ఏటా 35 వేల మంది డిగ్రి, పీజీలో చేరుతున్నారన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో యూనివర్శిటి ఉనికిపై నీలి నీడలు సోకుతూ వచ్చాయని క్రమంగా పరాయి రా ష్ట్రయూనివర్శిటి అనేభావంతో ఏపీకి చెందిన విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవడానికి వెనకడుగువేస్తు వస్తున్నారు. లక్షల మంది పేద బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే డా.బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయాన్ని రాష్ట్రం ఏర్పాటు చేయాల్సి ందిగా వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎ జిల్లా కార్యదర్శి నాగార్జున, నగర అధ్యక్ష కార్యదర్శులు పెద్దయ్య, పవన్, నాయకులు రాజు, మహేష్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్‌కు ధీటుగా ఆదర్శ విద్యాబోధన

**-ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల**



**రుద్రవరం, మార్చి 13, ప్రభాతవార్త :** రు ద్రవరం ఆదర్శపాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడిందని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు గురువారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. మార్చి 17 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్నదన్నారు. ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఇసి గ్రూపలున్నాయన్నారు. అన్ని గ్రూపులు కలిపి 160 సీటర్లు ఉన్నాయన్నారు. పదోతరగతి పరీక్షలు రాస్తూ చదువుతున్న వారు అర్హులన్నారు. ఓసి, బిసి, ఈబిసి వారు రూ.200, ఎస్‌సి, ఎస్‌టిలు రూ.150 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. మే 22లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం పదవతరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పదోతరగతి మార్కుల మెరిట్, రిజర్వేషన్లు, ధృవపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారనా న్నరు. విద్యార్థి నిర్ణీత తేదీలోగా ఆన్‌లైన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీట్లు పొందిన వారికి ఉచితవిద్య అందిస్తారన్నారు. దరఖాస్తు చేసిన ఫారంలను స్కూలు నందు అందజేయాలన్నారు. వివరములకు ప్రిన్సిపాల్ 9849215838 సెల్‌నెంబరుకు సంప్రదించాని నాగేశ్వరరావు సూచిస్తున్నారు.

# పిఠాపురం లో జరిగే జనకేతనకు బయలుదేరిన జనసైనికులు



**ఆస్పరి, మార్చి 13, ప్రభాతవార్త:** జనసేనా పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం పురస్కారించుకొని పిఠాపురంలో జరిగే జనకేతన కార్యక్రమానికి ఆలూరు జనసేన ఇర్‌చార్జ్ తెర్నెకల్ వెంకప్ప ఆధ్వర్యంలో గురువారం రెండు బస్సులలో జనసేన నాయకులు బయలుదేరారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు అరవింద్ మాట్లాడుతు పేద బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి కోసం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ స్థాపించారని, ఆయన ఆశయం కోసం ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు,. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, వీరేష్, చత్రపతి, చిరంజీవి, చంద్రమోహన్, శ్రీనువాసులు, విశ్వనాథ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య రంగంలో కీలకం డయాగ్నోస్టిక్ సేవలు



**నందికొట్కూరు, మార్చి 13, ప్రభాతవార్త:** వైద్య రంగంలో అత్యంత కీలకం డయాగ్నోస్టిక్ సేవలు అని కాని ప్రభుత్వాలు దశాబ్దాల తరబడి ల్యాబ్ టెక్నిషియన్స్ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని ఎన్జీవో సంఘం మరియు ఎపి మెడికల్ ల్యాబ్‌టెక్నిషియన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎన్.సత్యనారాయణ తెలిపారు. గురువారం ల్యాబ్ టెక్నిషియన్స్ డే సంధర్భంగా స్థానిక కార్యాలయంలో కేక్ చేసి సంభరాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు అన్ని విభాగాలలో కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నిషియన్స్‌కు సమాన పనికి సమాన వేతనం100శాతం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కొనసాగించాలి, ల్యాబ్ టెక్నిషియన్స్‌కు ప్రమోషన్ చానల్ ఇవ్వాలి, జోనల్ క్యాడర్‌గా మార్పు చేయాలి, అన్ని పిహెచ్‌సిలలో 2వ ల్యాబ్‌టెక్నిషన్ పోష్టు మంజూరు చేయాలి, వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగంలో టెక్నిషియన్ గ్రేడ్2గానే రిటైర్ట్ అవుతున్నాడని అంటే ఇది క్యాడర్‌కు గుర్తింపులేదని ఇది చాలభాధకరమని ఆయన తెలిపారు. ప్రజారోగ్యంలో ప్రధాన పాత్ర రోగనిర్ధారణ విభాగానికి సంభంధించిన ల్యాబ్ టెక్నిసియన్ దేనని కేవలం పరీక్ష ఫలాతాన్ని బట్టే వైద్యులు చికిత్సలు అంధిస్తారని ఇంతటి ప్రాధాన్యత కలిగిన ల్యాబ్ టెక్నిషన్ల సమస్యలు పరిష్కారించేందుకు ప్రభుత్వం స్పంధించడంలేదని, ఇప్పటికైన ప్రభుత్వం స్పంధించి ల్యాబ్ డే సంధర్భంగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో టెక్నిషియన్ల సమస్యలు పరిష్కారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నిషన్లు పాల్గొన్నారు.

# మైపర్‌లో ముగిసిన డివిస్ ల్యాబ్ జాబ్ మేళా



**కర్నూలు విద్య, మార్చి 13, ప్రభాతవార్తః** నగరంలోని ఏ క్యాంపు నందు గల మైపర్ కళాశాల యందు గురువారం డివిస్ ల్యాబ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ జరిగింది. కార్యక్రమంలో డివిస్ ల్యాబ్ హెచ్ఆర్ హరికృష్ణ, నవీన్ ఈరిక్రూట్మెంట్‌లో 200 మంది పాల్గొన్నారు. ఇందులో 70 మంది మైపర్ విద్యార్థులు సెలెక్టు కావడంతో కళాశాల డైరెక్టర డా.ఆదిమూలపు సతీష్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కె మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డా.కాసర్ల సురేష్, అకాడమిక్ డీన్ రాజ్‌కుమార్, ప్లేస్‌మెంట్ అఫీసర్ యూన్సీ ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ల్యాబ్‌టెక్నిషియన్‌కు ఘన సన్మానం

**- దేవనకొండ పీహెచ్‌సీలో ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ డే వేడుకలు**



**దేవనకొండ, మార్చి13, ప్రభాతవార్త;** దేవనకొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం స్థానిక ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్‌కు శాలువా, పూలమాలలు వేసి స్థానిక వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ సేవలను గుర్తు చేసుకున్నారు. దేవనకొండ, పుచ్చకాయలమాడ పీహెచ్‌సీల్లో శ్రావణ్‌కుమార్ పనిచేసి బదిలీపై ఇక్కడికి రావడం జరిగిందన్నారు. రోగులకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తున్నాడన్నారు. ప్రతి టెక్నీషియన్ సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్‌లు రంగస్వామి, మద్దిలేటి, జయలక్ష్మి, హనుమంతమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల సలహాలను పరిగణలోకి తీసుకుంటాం

**-కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్ రవీంద్రబాబు**



**కర్నూలు మున్సిపల్, మార్చి 13, ప్రభాతవార్తః** రాజకీయ పార్టీలు తెలిపే సలహాలు సూచనలు అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ ఎస్ రవీంద్రబాబు తెలిపారు. గురువారం నగర పాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమా వేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల సంఘం అదేశాల మేరకు ప్రతినెల మొదటివారంలో రాజకీయ ప్రతినిధుల సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చే సలహాలు, సూచనలు, అభ్యంతరాలను పరిశీలించి ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాగ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సమస్యలను లేవనెత్తారు. జోహరాపురం సమీపంలో ఇందిరమ్మ కాలనీలో పోలింగ్ కేంద్రం లేక జోహరాపురం 257, 258పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు వెళ్లాల్సి వస్తోందని వారిని దృష్టిల ఉంచుకొని ఇందిరమ్మ కాలనీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని టిడిపి, వైసీపీ, సిపిఎం, ఇతర పార్టీల ప్రతినిధులు ఆర్వో దృష్టికి తీసుకువచ్చారు. ఓటర్ల జాబితాలో చిరునామా, నగరపాలక ఇంటి నంబర్లు, కొత్తవి గందరగోళంగా ఉందని ప్రతినిధులు ఆర్వో దృష్టికి తెచా ్చరు. తహశీల్దార్ ఇ వెంకటలక్ష్మి, డిప్యూటి తహశీల్దార్ డబ్ల్యూ ధనుంజయ్, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

# రజక వృత్తిదారుల సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



**ఆలూరు, మార్చి 13, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముక్కన్న, గురుశేఖర్‌లు అన్నారు. గురువారం స్థానిక మంగళ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణం నందు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం కమిటీ సభ్యులు రమేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజకులకు రక్షణ చట్టం తీసుకురావాలని, రజక వృత్తిదారుల సంఘం జిల్లా 6వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. స్వాతంత్ర్యం వచ్చి 77సం॥లు పూర్తయినా నేటికి కూడా రజకుల స్థితిగతులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా రజకుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్నాయి. నేటికీ కూడా రజకులపైన దాడులు, సాంఘీక బహిష్కరణలు, అత్యాచారాలు కులం పేరుతో దూషణలు వేధింపులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సామాజిక దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22న కోడుమూరులో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు మండలంలో ఉండే రజక వృత్తిదారులు, మేధావులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చిగిలి ఈరన్న, నాగరాజు, హాలహర్వి ఈశ్వర్, ఆలూరు సిద్దప్ప, తుంబళం అంజి, సుధాకర్, సోమశేఖర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు రెయిన్‌బో విద్యార్థులు

**- అభినందనలు తెలిపిన పాఠశాల డైరెక్టర్, సిబ్బంది**



**పెద్దకడుబూరు, మార్చి 13, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన పెద్దకడుబూరులో రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు కెపి నరసింహులు, సి వినోద్‌లు రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎన్నికయ్యారు. గురువారం రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్ రంగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు అంజి, సీనియర్ ఉపాధ్యాయులు పుల్లయ్య తదితరులు విద్యార్థులను అభినందించారు. ఇటీవల ఆలూరులో జరిగిన జిల్లాస్థాయి జూడో పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం అభినందనీయమని రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా గెలుపొంది గ్రామానికి, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని వారు కోరారు.

# పాడిపరిశ్రమాభివృద్ధితో పాటు రైతులకు ఆర్థికంగా చేయూత

**జూపాడుబంగ్లా, మార్చి 13 , ప్రభాతవార్త :** ఆడ దూడల స ృష్టి ద్వారా పాడి పరిశ్రమాభివ ృద్ధితో పాటు రైతులకు ఆర్థికంగా చేయూతనివ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ గోవింద నాయక్ అన్నారు. జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా జిల్లా పశుగణాభివ ృద్ధి సంఘం ఆధ్వర్యంలో గురువారం లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశువుల్లో కృత్రిమ గర్భధారణ చేయించుకోవడం వల్ల మేలు జాతి మంచి పాలసార గల దూడలు పుడుతాయన్నారు. ఆడ దూడల పెంపకం ద్వారా పాడి రైతులకు లాభాలు వస్తాయన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా పుంజుకోవడం జరుగుతుందన్నారు. ఏపిఎల్‌డిఏ ఉపసంచాలకులు డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ పశువు ఎదకొచ్చినపుడు క ృత్రిమ గర్భధారణ ద్వారా ఎదసూదులు వేయించడం వల్ల మేలు జాతి దూడలు ఉత్పత్తి అవ్వటమే కాకుండా అవి త్వరగా కట్టుప్రాయానికి వచ్చి రెండున్నర సంవత్సరాలలోగా ఈనుతాయన్నారు. ఉపసంచాలకు శ్రీనివాసులు మాట్లాడుతూ దూడకు దూడకు మధ్య ఎడం తగ్గించి ఆవులు, సంవత్సరానికి ఒక ఈత, గేదలు 14 నెలలకు ఒక ఈత ఈనెల చూసుకోవాలన్నారు. సందర్భంగా ప్రదర్శనకు వచ్చిన దూడలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు దూడల యజమానులకు అందజేశారు. అనంతరం క్యాల్షియం టానిక్, దాతు మిశ్రమ ఇటుక మరియు నట్టల నివారణ మందులు దూడల యజమానులకు అందజేశారు. సర్పంచ్ ప్రకాశం, సహాయ సంచాలకులు రామాంజనేయ నాయక్, డాక్టర్ పావని రెడ్డి, డాక్టర్ రాగ సంధ్య, డిఎల్‌డిఏ డాక్టర్ చంద్రమోహన్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

